క్లుప్తంగా

ప్రణాళికతోనే అభివృద్ధి



డక్కిలి: వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం

డక్కిలి: పంచాయతీల అభివృద్ధికి ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు భాగస్వామ్యం కావాలని రిసోర్స్ పర్సన్‌లు వెంకటాద్రి, వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వార్డు మెంబర్లకు రెండో రోజు మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల్లో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌ల పాత్రను వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వనరులు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. చట్టపరంగా పరిపాలన, విధులు, బాధ్యతలను వివరించారు. సభలు, సమావేశాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మన్నెముద్దు అశోకుడు కుటుంబసభ్యులు మంగళవారం రూ.1,11,111 అందించారు. విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి మాజీ సభ్యురాలు ఎంఎం పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ సూర్యధర్మేంద్ర

రాపూరు: ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులు సూర్యధర్మేంద్ర పేర్కొన్నారు. రాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందేలా చూడాలని కోరారు.

గుండె పోటుతో యర్రగుంట్లవాసి మృతి



మృతి చెందిన శ్రీకాంత్‌రెడ్డి

చిల్లకూరు: వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన ఓ లారీ డ్రైవర్ లోడింగ్ కోసం వచ్చి గుండె పోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం వేకువ జామున చిల్లకూరు మండలం తిమ్మనగారిపాళెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని తిమ్మనగారిపాళెం గ్రామంలో ఉన్న పినాకిని సిలికా వాషింగ్ ప్లాంట్ వద్ద సిలికా లోడ్డు కోసం సోమవారం రాత్రి లారీలు వచ్చాయి. వీటిలో ఒక లారీని వైఎస్సార్ కడపజిల్లా యర్రగుంట్లకుకు చెందిన డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డి(34) తీసుకుని వచ్చాడు. సిలికా లోడింగ్ ఆలస్యం కావడంతో అతను లారీలోనే నిద్రకు ఉపక్రమించాడు. నిద్రలోనే గుండె పోటు రావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చినుకురాలితే రోడ్లు జలమయం



తనియాలి గ్రామంలో దుస్థితిలో ఉన్న రోడ్డు

దొరవారిసత్రం: మండలం పరిధిలో సోమవారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికి పలు గ్రామాల్లోని రోడ్లు జలమయంగా మారాయి. ఇందులో ముఖ్యంగా తనియాలి, వేణుంబాకం, పాళెంపాడు, కిష్టప్పకండ్రిగ తదితర గ్రామాలకు వెళ్లే మార్గాల్లో పీఆర్, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలోని తారు రోడ్లపై అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. వర్షపు నీరు నిలిచిపోయి జలమయంగా మారుతున్నాయి. తనియాలి గ్రామం నడిబొడ్డున ఉన్న రోడ్డుపై పెద్ద గోతులు ఉండడంతో వర్షపునీరు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలియజేశారు. సంబంధిత అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

నేడు డక్కిలి మండల సమావేశం

డక్కిలి: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ అనురాధ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

అన్నదాతకు అందని భరోసా

- ముగిసిన ఖరీఫ్... ఆరంభమైన రబీ
- పథకం పేరు మార్పునకు మాత్రమే పరిమితం
- రైతన్నల గోడు పట్టించుకోని ప్రభుత్వం

వెంకటగిరి(సైదాపురం): దేశానికి వెన్నెముక అయిన రైతన్నకు ప్రభుత్వం నుండి భరోసా అందడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినప్పటికీ రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ఆరంభించి ఏటా రైతన్నలకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఒట్టి మాటగానే మిగిలిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు పూర్తి కావస్తున్నా రైతన్నలకు ఎలాంటి పెట్టుబడి సాయం అందిన దాఖలాలు లేవు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ఆరంభమైపోయింది. రైతన్నలు సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నాట్లు వేస్తున్న రైతులు

తప్పని ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం గత ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందించలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎరువుల కొనుగోళ్లకు సైతం అప్పులు చేయక తప్పలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. అయితే కూటమి ప్రభుత్వం ఆదుకోకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం నష్టాలు పాలవ్వాల్సి వచ్చింది. కనీసం రబీ సీజన్‌లో అయినా పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా....

గత వైఎస్సార్ సీపీ పరిపాలనలో రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటూ ముందుకు సాగారు. కరోనా కష్టకాలంలో సైతం రైతుభరోసా పథకం ద్వారా మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీలను నెరవేర్చారు. రైతులకు నేనున్నాను అంటూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. పంటల సాగు, పెట్టుబడుల కోసం రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఏటా క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తూ భరోసా కల్పించారు. కౌలు రైతులతోపాటు ఆర్ఓఎఫ్ఆర్, డీకేటీ పట్టాలు పొందిన రైతులను కూడా ఆదుకోవాలని పెద్ద మనసుతో వారికి కూడా రైతుభరోసా పథకాన్ని వర్తింప చేశారు.

వైఎస్సార్ సీపీ రైతుభరోసా ద్వారా రైతులు పొందిన లబ్ధి

మండలం	రైతులు	పొందిన లబ్ధి
వెంకటగిరి (మున్సిపాలిటీ)	1891	62,623,500
వెంకటగిరి (రూరల్)	3989	178,999,820
బాలాయపల్లి	6131	299,704,600
డక్కిలి	7947	236,630,470
సైదాపురం	6974	246,360,500
రాపూరు	4797	23,03,06,051
కలువాయి	6488	3,19,99,2500

వెంకటగిరి నియోజకవర్గంలో రైతుల వివరాలు

వెంకటగిరి	6600
బాలాయపల్లి	7400
డక్కిలి	7120
రాపూరు	4800
సైదాపురం	7600
కలువాయి	11000
నియోజకవర్గం మొత్తం	44,520

అన్నదాతకు అండగా నిలవాలి



గత ప్రభుత్వం ఏటా జూన్ మాసంలోనే రైతు భరోసా నిధులను నేరుగా మా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసేది. ప్రస్తుత ప్రభుత్వం ఇంకా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయలేదు. రైతులు రబీ సాగుకు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

– పాకాల ఏడుకొండలు, తిప్పిరెడ్డిపల్లి, సైదాపురం మండలం

ఏదీ అన్నదాత సుఖీభవ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయంగా ఏటా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 4 నెలలు గడుస్తున్నా హామీ నెరవేర్చలేదు. గత ప్రభుత్వం హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా అందేది. సాగుకు అప్పులు చేయాల్సిన పని లేకుండా ఉండేది.

– యల్లంరాజు వరప్రసాద్‌రాజు, సైదాపురం

వరి సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

డక్కిలి: వరి సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులతోపాటు లాభాలు పొందవచ్చునని వ్యవసాయశాఖ అధికారి విజయభారతి తెలిపారు. మండల కేంద్రమైన డక్కిలి, కందలవారిపల్లిలో ఉద్యాన శాఖ అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసే ముందు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాల ఉపయోగాలను తెలియజేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వచ్చే రాయితీలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది భాస్కర్, బాషా, లిఖిత, శ్రీహరి, హరి, శ్రీను పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో





ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంకయ్య, సతీష్

నాయుడుపేట టౌన్: తుమ్మూరు గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి బైక్‌ను ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లో ఉన్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఓజిలి మండలం సగుటూరు వడ్డిపాళెం గ్రామానికి చెందిన సతీష్, అంకయ్య, వెంకటేష్ నాయుడుపేటకు వచ్చి తిరిగి రాత్రి వారి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరారు. తుమ్మూరు గ్రామ సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న ఆటో వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌లో ఉన్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ఇళ్లు నిర్మించకుంటే స్థలాలు వెనక్కు తీసుకుంటాం

– సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ వెల్లడి



సర్వసభ్య సమావేశంలో అధికారులతో సమీక్ష

తడ: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో మార్చి 31 లోపు ఇళ్ల నిర్మాణం జరగకుండా ఉంటే అలాంటి స్థలాలను ప్రభుత్వం వెనక్కు తీసుకుని ఇతరులకు కేటాయిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శరత్ తెలిపారు. మండల 13వ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శరత్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఏఈ మురళి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న యాభై శాతం సబ్సిడీతో ఇళ్లు, వ్యాపార భవనాలపై సన్ రూఫ్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ కే రఘురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ ఖోఖో ఎంపికలు



జేఎన్‌టీయూఏ ఖోఖో టీం సెలక్షన్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

కోట: జేఎన్‌టీయూఏ అంతర విశ్వవిద్యాలయ క్రీడాపోటీలలో పాల్గొనే ఖోఖో టీం సెలక్షన్స్ మంగళవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ క్రీడా మైదానంలో యూనివర్సిటీ అబ్జర్వర్ జాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పురుషుల విభాగంలో వివిధ కళాశాలల నుంచి 75 మంది పాల్గొనగా 15మందిని ఎంపిక చేశారు. వీరు డిసెంబర్‌లో కాలికట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. మహిళల విభాగంలో వివిధ కళాశాలల నుంచి 60 మంది పాల్గొనగా 15 మంది ఎంపికయ్యారు.వీ రు డిసెంబర్‌లో చెన్నై సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని కళాశాల పీడీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పీడీలు సుకుమార్, అంజనీకుమార్ పాల్గొన్నారు.

ఆర్గానిక్ పంటల సాగుపై దృష్టి

వెంకటగిరి రూరల్: రైతులు, మహిళలు ఆర్గానిక్ పంటలపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.విజయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని జంగాలపల్లి, పెట్లూరు గ్రామంలో ఉద్యాన, కూరగాయల పంటల సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆర్గానిక్ పంటలు సాగు చేయడంతో నాణ్యమైన దిగుబడితోపాటు భూ సంరక్షణ ఉటుందని తెలియజేశారు. వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్, ఏఓ సుజాత, రైతులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని బంగారుపేట పీహెచ్‌సీలో కుష్టువ్యాధిపై టీబీ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ రాజనయక్, జిల్లా ప్రోగ్రాం అధికారి రాజేంద్ర, బంగారుపేట పీహెచ్‌సీ వైద్యురాలు జినిత, పాతకోట పీహెచ్‌సీ వైద్యులు రాజేష్, రవితేజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

బాలాయపల్లి(సైదాపురం): ఆశ వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని స్థానిక వైద్యాధికారి ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశ వలంటీర్లకు అంటు వ్యాధులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్ఓ నీరజ, వైద్యసిబ్బంది నరసింహులు పాల్గొన్నారు.

చెరువుకు నీరు చేరే వేళ... మట్టి దందా



చెరువులో మట్టి తవ్వకాల అడ్డుగా పడుకున్న వైఎస్సార్ సీపీ బీసీ నేత మాతయ్య యాదవ్



మట్టి తవ్వకాలను అడ్డుకోవడంతో నిలిచిపోయిన లారీలు

- టీడీపీ నాయకులమని చెప్పుకునే ముఠా నిర్వాకం
- హిటాచీ యంత్రాలు, టిప్పర్లతో భారీ ఎత్తున తవ్వకాలు
- తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు
- అయినప్పటికీ దౌర్జన్యంగా తవ్వకాలు చేపట్టిన ముఠా
- ఆయకట్టుదారులకు భారీ నష్టం

పెళ్లకూరు: ఆరు వందల ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన రావులపాడు చెరువుకు ప్రస్తుతం తెలుగుగంగ కాలువ నుంచి సాగునీరు చేరే సమయం. అయితే మండలంలో టీడీపీ నాయకులమని తమకు తామే చెప్పుకునే ఓ ముఠా కన్ను రావులపాడు చెరువుపై పడింది. ఇదే అదునుగా చెరువులో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టారు. చెరువు కట్టను సైతం తొలగించి నేరుగా గ్రావెల్ రోడ్డు నిర్మించేశారు. లోకల్ దండుపాళెం బ్యాచ్‌గా పేరుగాంచిన ఈ ముఠా వందలాది టిప్పర్లతో మట్టిని తరలించేందుకు పూనుకుంది. అయితే గ్రామస్తులు, రైతులు గ్రామ సర్పంచ్ గంజి పెంచలమ్మ భర్త, వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు గంజి మాతయ్య యాదవ్ ఆధ్వర్యంలో తవ్వకాలను అడ్డుకున్నారు. అయితే మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న ముఠా గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగింది. దీంతో టిప్పర్లు, హిటాచీ యంత్రాలకు గ్రామస్తులు అడ్డుగా పడుకున్నారు. నామమాత్రపు అనుమతులు చూపుతూ గ్రామస్తులను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే పంచాయతీ అనుమతులు లేకుండా మట్టి తరలించేందుకు ఒప్పుకోబోమని గ్రామస్తులు భీష్మించారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు గ్రామస్తులను బలవంతంగా గ్రామంలోకి తరలించి నామమాత్రపు అనుమతులతోనే మట్టిని తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఇతర అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. ఎవరికి అందాల్సిన వాటా వారికి చేరిపోవడంతో పోలీసులు, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

శ్రీమహాలక్ష్మిగా చెంగాళమ్మ పరమేశ్వరి



సూళ్లూరుపేట చెంగాళమ్మ



మూకాంబికా అమ్మవారు



కన్యకాపరమేశ్వరి



ఆదిలక్ష్మీ దేవి

సూళ్లూరుపేట: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీ అలంకారంతో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి నాయుడుపేటకు చెందిన ఓడూరు మునికృష్ణారెడ్డి, పావని దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మహా చండీ యాగం కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చండీయాగానికి ఒంగోలుకు చెందిన యర్రం హనుమారెడ్డి, హిమబిందు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉభయదారులకు సాయంత్రం కుంకుమార్చన నిర్వహించి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. నెల్లూరుకు చెందిన లవ్లీ ఈవెంట్స్ బృందం వారు నిర్వహించిన సినీ భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. మంగళవారం కస్పారెడ్డిపాళెం, దేగలపాళెం, సోనియాగాంధీనగర్, బాపూజీ కాలనీకి చెందిన భక్తులు అమ్మవారికి చీరసారెలను సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మ వారికి చీరలు సారెలు సమర్పించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్న లక్ష్మీ దగ్గరుండి చీరసారెలను స్వీకరించారు.

నాయుడుపేటలో...

నాయుడుపేట టౌన్: గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం, మూకాంబికా దేవి ఆలయం, దుర్గామల్లేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవార్లకు శ్రీమహాలక్ష్మి దేవిగా అలంకరణలు చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి రాజరాజేశ్వరి అలంకారం చేపట్టి, పూజలు నిర్వహించారు. పట్టణంలోని వల్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం, మానస దేవి, అంకాళమ్మ, అఖిలాండేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

దక్కిలిలో..

దక్కిలి: ప్రముఖ శైవక్షేత్రమైన దేవునివెల్లంపల్లి గ్రామంలోని స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి మంగళవారం మహాలక్ష్మీ దేవీ అలంకరణలో భక్తులుకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

సైదాపురంలో..

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి అమ్మవారు మంగళవారం గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చండీహోమం, పూలంగిసేవతోపాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానకార్యక్రమం ఏర్పాటుచేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సంతాన లక్ష్మిగా ఆదిలక్ష్మీదేవి

రాపూరు: పెంచలకోన ఆదిలక్ష్మీదేవి అమ్మవారు మంగళవారం సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9.30 గంటలకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి ఆదిలక్ష్మి ఉత్సవమూర్తిని సంతానలక్ష్మిగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు .రాత్రి 9 గంటలకు దర్బారు సేవ నిర్వహించారు.

మహాలక్ష్మిగా అంకమ్మతల్లి

మండలంలోని వేపినాపి సమీపంలోని అంకమ్మతల్లి మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నదానం నిర్వహించారు. రాపూరు గ్రామదేవత మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరిదేవి ధనలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవార్లకు మహాలక్ష్మి అలంకారం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కర్ణమ్మవీధిలోని హరహర క్షేత్రంలోని కాత్యాయిని, శ్రీదేవి అమ్మవార్లు, వెలమపాళెం సమీపంలో ఉన్న శ్రీ మందనాంచారమ్మ తల్లి, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవార్లకు విశేష అలంకరణ

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని కాళికాదేవిగా అలంకరించారు.



రాపూరు- పెంచలకోనలో..



పోతుకొండలో మహాలక్ష్మి..



రాపూరు- మహాలక్ష్మిగా...



లక్ష్మీదేవిగా మందనాంచారమ్మ



ముత్యాలమ్మ

కనుల పండువగా కల్యాణోత్సవం



వెంకటేశ్వరస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యూహాలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివార్ల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవ వేడుకలను వేదపండితులతో కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణ వైభవాన్ని, చాటి చెబుతూ శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో దేవతామూర్తుల ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎన్‌బీకేఆర్‌కు నాక్-ఏ గ్రేడ్



మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ రావడం కళాశాల ప్రతిష్టను మరింత పెంచిందని ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కళాశాలను విజిట్ చేసిన నాక్ పీర్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం యూజీసీ నాక్ ఏ గ్రేడ్‌ను ప్రకటించామన్నారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. వచ్చే ఏడాది అరవయ్యేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని రాంకుమార్‌రెడ్డి సూచించారు. త్వరలో ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలు యూనివర్సిటీగా రూపుదిద్దుకుంటాయన్నారు. విద్యార్థుల కోసం కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సలరెడ్డి, కళాశాల మేనేజర్ రామక్రిష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆర్‌కే రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కండలేరులో 28.098 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 28.098 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 1250, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.10 వేలు గూగుల్ పే చేసుకుని పరారైన ఘనుడు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న మనీ ట్రాన్స్‌ఫర్ దుకాణంలో రూ.10 వేలు నగదు గూగుల్ పే చేసుకుని పరారయ్యాడో ఘనుడు. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితుడు నెల్లూరుపల్లి సందీప్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తగా ఆన్‌లైన్ సేవలు అందించే దుకాణం పెట్టుకుని ఉన్నట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం దుకాణం వద్ద అతని తల్లి శశికళను పెట్టి సందీప్ ఇతర పనులపై బయటకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రూ.10 వేలు ఫోన్ పే చేయాలని అడిగాడు. దీంతో ఆమె కుమారుడు సందీప్‌కు ఫోన్ చేయడంతో వెంటనే అతను చెప్పిన నంబరుకు రూ.10 వేలు గూగుల్ పే చేశాడు. అయితే ఆ వ్యక్తి నగదు చెల్లించకుండా దుకాణం వద్ద నుంచి పరుగులు పెట్టి పరారయ్యాడు. ఆమె దుకాణం వెలుపలకు వచ్చి వ్యక్తి పారిపోతున్నాడని పెద్దగా అరిచినా ఉపయోగం లేకపోయింది. ఈ మేరకు బాధితుడు సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారిస్తున్నారు.